# మహా జాతకుడు



సంమిత్రకు తొమ్మిది నెలలు నిండి వారం గడుస్తున్నా కాన్పు వచ్చే సూచనలేవీ కనపడక అంతా ఒకటే కంగారు. ఎక్స్‌పెక్టెడ్ డేట్ కూడా దాటింది.

అనుకున్న దానికి నాలుగు రోజులు అటూ ఇటూగా కాన్పు కావటం సాధారణమేనని, దానికోసం ఆందోళనేంపడొద్దని డాక్టర్ చెప్తూనే వుంది.

రాఘవయ్య కూతుర్ని నాలుగు రోజులు ముందే ఆసుపత్రిలో చేర్చాడు. వియ్యాలవారు నాలుగు రోజుల్నుండి ఇంట్లోనే మకాం. డెలివరీ కాలేదాని అల్లుడు ఫోన్‌ల మీద ఫోన్‌లు.

రాఘవయ్య ఇంటికీ, ఆసుపత్రికీ పరుగులు పెడుతూ సతమతమై పోతున్నాడు. ఓ ఆసామి కాళ్ళూ చేతులు పట్టుకొని మూడు రూపాయిల వడ్డీకి తెచ్చి సిద్ధం చేసుకొన్న డబ్బు రోజురోజుకీ తరిగి పోతుంటే దిగులుపట్టుకొంది.

స్కానింగ్ పుణ్యాన పుట్టేది మగపిల్లవాడని తెలిసి, సుమిత్ర మామ పూర్ణయ్య ఒకటే హడావిడి. పంచాంగం చంకలో పెట్టుకొని గడియలు, వారాలు, తిథులూ, నక్షత్రాలూ గుణిస్తున్నాడు.

“తీరా అమావాస్యముందు కంటుందేం కర్మ! అసలే మగబిడ్డాయె! ఇక అంతకన్నా అరిష్టం ఏముంటుంది?” అంటూ మథనపడిపోయాడు.

అమావాస్య గడిచింది. గండం గడిచిందని పూర్ణయ్య తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు. కానీ అంతలోనే మరో ఉపద్రవం ముంచుకొస్తున్నట్లు పసిగట్టి అర్జంటుగా రమ్మని కొడుక్కి ఫోన్ చేశాడు. ఏం కొంపమునగబోతుందోనన్న భయంతో తక్షణమే బయల్దేరివచ్చాడు రాజు.

సోమవారం విదియ. స్వాతీ నక్షత్రంలో పిల్లవాడు పుడితే గొప్ప జాతకుడవుతాడనీ ఆ తరువాత విశాఖగండ నక్షత్రంలో పుడితే అన్నీ అనర్థాలేననీ వాపోయాడు పూర్ణయ్య. తండ్రిమాటలకు బెంబేలెత్తిపోయాడు రాజు. పంచాంగం కిందా మీదా వేసి లెక్కలుగట్టి తగిన ఉపాయం ఏమిటో తనే చెప్పాడు కొడుక్కి.

తండ్రీ కొడుకులు రాఘవయ్యకు తమ ఆలోచన చెప్పారు. అతను ఎంతో కలవరపడ్డాడు. కాదని వియ్యాలవారితో కయ్యం ఎందుకని అయిష్టంగానే తలూపాడు.

సోమవారం సుమిత్రకు నొప్పులు ప్రారంభమయ్యాయి. కాని జననమార్గం ఇరుకుగా వుండటం కారణంగా సహజంగా ప్రసవమయ్యే అవకాశం లేదని, ఆపరేషన్ చేసి బిడ్డను బయటకు తియ్యాలని డాక్టర్ తేల్చి చెప్పింది.

భార్యకు ఆపరేషన్ చేయాల్సి వచ్చిందన్న బాధ కన్నా, పుట్టబోయే బిడ్డ జాతకదోషాన్ని సవరించుకోవటానికి లభించిన గొప్ప అవకాశంగా రాజు సంతోషించాడు.

డాక్టరమ్మను కలిసి తన కొడుకు మధ్యాహ్నం రెండు గంటల నలబైమూడు నిమిషాలకు పుట్టాలన్నాడు. అది తన చేతుల్లో లేదని, సాధ్యమైనంత త్వరగా ఆపరేషన్ చెయ్యకపోతే తల్లికీ, బిడ్డకూ ప్రాణాపాయమని చెప్పింది. బిడ్డ పుట్టే వేళా విశేషం బాగుండాలని డాక్టర్‌ని బ్రతిమాలుకున్నాడు. అంతదాకా ఏదో విధంగా పరిస్థితి చేయి దాటకుండా మానేజ్ చెయ్యమని వేడుకున్నాడు.

డాక్టరమ్మ చివరకు మెత్తబడింది. ఇందులో తనే మాత్రం రిస్క్ బేర్ చెయ్యలేనంది. అంగీకారపత్రం మీద సంతకాలు తీసుకొంది. ఆపరేషన్ ఫీజు మాత్రం కాస్త పెచ్చుగానే పదివేలని తేల్చిచెప్పింది. ఆ ఖర్చు మా మామగారే చూసుకుంటా రన్నాడు రాజు.

అప్పు ఇచ్చే చేతులు వెతుక్కుంటూ పరుగులు పెట్టాడు రాఘవయ్య.

ఈ విషయం సుమిత్రకు చెప్పింది తల్లి. పుట్టినప్పుడే పుడతాడు బిడ్డ, దీనికి ముహూర్తం చూడటం, ఆపరేషన్ చెయ్యడం ఏమిటని విరుచుకుపడింది.

ఆ ముహూర్తం ఎంత గొప్పదో, పుట్టేవాడు ఎంత మహాజాతకుడు అవుతాడో భార్యకు పంచాంగం సాక్షిగా చెప్పాడు రాజు. పడేది నేను, కనేది నేను, పెంచేది నేనంటూ భీష్మించుకొంది సుమిత్ర.

రాజుకు కోపం వచ్చింది.

"మేం నిర్ణయించిన ముహూర్తానికి బిడ్డ పుడితే కబురు చెయ్యండి. లేకుంటే నేను మీకు అల్లుడ్నని మర్చిపోండి" తెగేసిచెప్పి అలిగి ఊరెళ్ళాడు రాజు.

రాఘవయ్యకు కాళ్ళు చేతులు చచ్చు బడ్డట్లయింది. పెళ్లికి చేసిన అప్పులింకా తీరకుండానే కూతురి కాపురంలో ఈ చిచ్చేమిటని విలవిలలాడాడు.

"నాన్నా! బిడ్డను కనే తల్లిగా కూడా నాకు స్వేచ్ఛ లేదా? ఎట్లా కనాలో, ఎప్పుడు కనాలో కూడా వాళ్ళే నిర్ణయిస్తారా?" అంటూ వాపోయిందామె.

"అమ్మా! బిడ్డ నీ ఇష్టప్రకారం పుడితే నష్టజాతకుడవుతాడు. వాళ్ళిష్టప్రకారం పుడితే మహాజాతకుడవుతాడు. నీ బిడ్డ భవిష్యత్తు నీ చేతుల్లోనే వుందమ్మా! నిన్ను పుట్టింట్లో పెట్టుకొని బయట తలెత్తుకొని తిరగగలనామ్మా?" అంటూ కూతురి చేతులు పట్టుకొని కన్నీళ్ళు పెట్టాడు రాఘవయ్య.

ఆపరేషన్ థియేటర్లో సరిగ్గా మధ్యాహ్నం రెండు గంటల నలబైమూడు నిమిషాలకే, నిశ్చయించిన శుభముహూర్తంలో సుమిత్ర కడుపు చీల్చుకొని మగబిడ్డే పుట్టాడు మారాజులా!

"మా మనవడ్ని చూడండి! విశాలమైన నుదురు, ఆ ముఖం, ఆ వర్చస్సు ఎలా వెలిగిపోతున్నాడో! ఎంతయినా పుట్టిన వేళావిశేషం మరి! మహామహులెందరో స్వాతి నక్షత్రంలో పుట్టినవాళ్ళే! వీడు ఇంజనీరో, డాక్టరో, ఇంకా గొప్పవాడో అవుతాడు. జాతకబలం అలాంటిది!" పూర్ణయ్య అత్యుత్సాహంగా మనవడి గురించి చెప్పుకుపోతున్నాడు.

మావగారి ముచ్చట్లు అప్పుడే మత్తువిడి స్పృహలోకి వస్తున్న సుమిత్ర చెవుల్లో గింగురుమంటున్నాయి.

'కడుపుకోత' తాలూకు బాధ కళ్ళ నుండి జాలువారుతుంటే, 'మగపుట్టుక పుట్టాక మహాజాతకుడు కాకుండా పోతాడా?' అనుకొన్నది పళ్ళబిగువున నొప్పిని అణుచుకొంటూ.

❄

*(పేజి కథలపోటీలో రెండవ బహుమతి పొందిన కథ)*

*(స్వాతి సపరివార పత్రిక - 1996)*